


"గోపూ......"

"తారూ....."

"గోపూ......"

"తారూ....."

"థూ..... మీయబ్బ"

కర్ణకఠోరమైన తిట్టు పదం వినిపించేసరికి అరగంటనుంచి ఒకరి కళ్ళలోకి మరొకరు చూసుకుంటున్న గోపూ అనబడే గోపాలం, తారూ అనబడే తాయారూ ఉలిక్కిపడి, వీపులు చరుచుకుని, ఆ కర్ణ కఠోరమైన పదప్రయోగం చేసిన శాల్తీ వైపు చూసారు.

"హలో.... ఏంటా లుక్కు..... ఈ పార్కులో లాంగ్ లాంగ్ ఎగో నుంచి బఠానీలు అమ్ముతున్నా... ఎంత మందిని అనుకున్నారు.... యింతమందిని...." అంటూ నెత్తిలో వున్న వెంట్రుకల వైపు చూపిస్తూ "యింత మందిని చూసా....."

"కళ్ళలో కళ్ళు పెట్టుకుంటూ ప్రేమలో పడ్డవాళ్ళని, ఒకరి ఒడిలో ఒకరు తలపెట్టుకున్న వాళ్ళని, మలయాళ బూతు సినిమాల టైప్ జంటలను బోల్డు చూసాను! కానీ, మీలాంటి వాళ్ళని ఎప్పుడూ చూడ్లేదు"

"అరగంట నుంచి బఠానీలు.... టైం పాస్ బఠానీలు అని అరుస్తున్నా.... అలా "గోపూ..... తారూ....." అంటూ అనుకోవడమే గానీ, పనిలో దిగడంగానీ, పోనీ పాపం, బఠానీలుకాని తినిపెడదామన్న ధ్యాస గానీ వుందా".

నాన్‌స్టాప్‌గా బఠానీలమ్మే అబ్బి.... మాట్లాడుతూపోతున్నాడు.

సిగ్గుతో మెలికలు తిరిగిపోయాడు గోపాలం.

తనూ మెలికలు తిరిగితే, తన అందాలను చొంగకారుస్తూ బఠానీలవాడు చూస్తాడని ఆ పన్జేయలేదు తాయారు. వెంటనే బఠానీల వాడివైపు చూసి, వాడిదగ్గరున్న బఠానీలు టోకున మొత్తం కొనేసి, అతడ్ని వెళ్ళమన్నాడు గోపాలం.

వాడు తొందరగా వెళ్ళిపోతే, తను, తన తారూ.... మళ్ళీ ఒకరి కళ్ళలోకి మరొకరు చూసుకుంటూ గడిపేయొచ్చని అతని ప్లాన్.

కానీ, బఠానీలబ్బి అక్కడే వున్నాడు.

ఏంటన్నట్టు చూశాడు గోపాలం.

"మీ చొక్కా ఓసారి విప్పుతారా?" బఠానీలబ్బి అడిగేడు.

"ఛీ.... పాడు.... నేనా టైప్ కాదు" సిగ్గుతో చితికిపోతూ అన్నాడు గోపాలం.

"అదే మరి ఓవరాక్షన్ అంటే...." అని మనసులో అనుకొని....

"నేనూ ఆ టైప్ కాదు లేవయ్యా.... బఠానీలు

కొన్నారు కదా.... వాటిని చొక్కాలో పోద్దామని..."

గోపాలానికి విషయం అర్థం కాలేదు.

"అదికాదు.... నా బఠానీలు కొన్నారు సరే, మరి బఠాణీల బుట్ట...."

గోపాలం కిలకిల నవ్వి బఠానీల బుట్ట కూడా కొన్నాడు.

"గోపూ.... యిప్పుడెందుకు యివన్నీ...." అడిగింది తన్మయత్వంగా తాయారు.

"ఈ బిజినెస్ బావుందనీ.... పార్కులో తిరిగి బఠానీలమ్ముదామని...." కసిగా చెప్పాడు గోపాలం.

"బావోదేమో బావా.... అయినా లక్షణంగా బ్యాంక్‌లో పన్జేస్తూ, ఈ కక్కుర్తి బిజినెస్ ఏమిటి? పైగా తెలిసినవాళ్ళు చూస్తే అసయ్యంగా ఉంటుంది" తాయారు తెగ ఫీలయిపోతూ అంది.

గోపాలం చురచురా తాయారు వైపు చూసి, చొక్కా చింపుకునే ప్రయత్నం చేయబోయి, ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

"అర్రెర్రె.... ఆ బఠానీల వాడి వల్ల మనకు డిస్టర్బ్ వుండకూడదనా?" సడన్‌గా ఐడియా ఫ్లాష్ అయి అడిగింది తాయారు.

"ఫర్లేదు తారా.... అప్పుడప్పుడైనా నీ బుర్ర మోకాల్లో నుంచి తలకాయలోకి వచ్చి పన్జేస్తుంది" అన్నాడు గోపాలం బొట బొట రెండు ఆనందభాష్పాలు రాలుస్తూ.

★ ★ ★

గోపాలం, తాయారు బావా మరదళ్ళు ప్లస్ ప్రేమికులు.

చిన్నప్పట్నుంచి తెగ ప్రేమించేస్కున్నారు.

హైద్రాబాద్‌లో బ్యాంకులో వుద్యోగం వచ్చింది.

వచ్చే నెలలో పెళ్ళికి ముహూర్తాలు.

కానీ, ఈలోగా తెగ ప్రేమించేసుకోవాలని, పెళ్ళయ్యాక ప్రేమించే సెక్షన్ వుండదని, ఓ నిర్ణయానికి వచ్చి, పెళ్ళికిముందు వుండే ప్రేమలోని "థ్రిల్లు"ని పొందాలని డిసైడయ్యారు.

గోపాలం సెలవుపెట్టి, మరదలు తారాని తీసుకొని పార్క్‌కు వచ్చాడు.

అదీ అసలు విషయం.

★ ★ ★

ఓ చెట్టు క్రింద కూర్చున్నారిద్దరూ......

"గోపూ...." గోపాలం జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి అంది గోముగా తాయారు.

"అబ్బ చచ్చానే దొంగ ముం....." అప్రయత్నంగా అరిచి అన్నాడు గోపాలం.

"బావా... నా గోపూ.... నన్నెంత మాటన్నావు" అంది బొట బొట రెండు విషాదభాష్పాలు రాలుస్తూ.

వెంటనే గోపాలం తెగ సిగ్గుపడిపోయి....

"సారీ.... తారూ.... నువ్వు గోముగా వెంట్రుకల్లో వేళ్ళు పోనిచ్చి పట్టి పీకావు. అయిదారు వెంట్రుకలు బయటకు వచ్చాయి. ఆ బాధతో అలా అన్నానన్నమాట."

"పోనీలే గోపూ.... యిప్పుడిక ప్రేమ కబుర్లు చెప్పుకుందామా" అంటూ అతని ఒళ్ళో పడుకుని ఉలిక్కిపడింది.

కారణం.... ఎదురుగా వున్న ఇద్దరు కుర్రాళ్ళు తమ వైపే చూస్తున్నారు.

"బావా... నా గోపూ... వాళ్ళిద్దరూ నావైపు దొంగ కారుస్తూ చూస్తున్నారు" చెప్పింది తాయారు.

గోపాలానికి చిర్రెత్తుకొచ్చింది. వాళ్ళని నాలుగు ఎడాపెడా వాయిద్దామనుకున్నాడు. కానీ, వాళ్ళు ఎదురు తిరిగితే తన బాడీలో ఏ పార్టూ మిగలదని అర్థమై....

"పోనీ తారూ... మరోచోటకు పోదాం" అంటూ లేచి, దూరంగా వున్న పొదల దగ్గరికి వెళ్ళి అక్కడే వున్న ఓ సిమెంట్ బెంచీమీద కూచున్నారు.

తాయారు భుజం మీద తలపెట్టి

"తారూ డాళింగ్..." అన్నాడు.

"యస్ మై డియర్ గోపూ...." అంది తాయారు.

"నీ నడుంమీద గిల్లాలనివుంది డాళింగ్...." అన్నాడు గోపాలం.

"యూ సిల్లీ...." అంది తాయారు.

"యూ డబుల్ సిల్లీ..." అన్నాడు గోపాలం హుషారుగా.

"అంతేనా..... నా నడుం మీద గిల్లేదుందా? లేదా?"

"నడుం మీద గిల్లాలని వుంది...." అని అయిదు నిమిషాలైనా తన బావ ఆ పన్జేయకపోవడంతో అంది ఒళ్ళుమండి తాయారు.

"గిల్లకపోతే ఏం చేస్తావమ్మా.... " బుంగమూతి పెట్టుకొని అడిగాడు టీజింగ్‌గా గోపాలం.

తాయారు రియాక్షన్ పిచ్చలెవల్లోవుంటుందని తెలియక.

"ఇందాక నీకు బఠానీలమ్మాడే...."

"అమ్మితే....."

"వాడ్ని పిలిచి గిల్లమంటాను" మరింత కచ్చగా అంది తాయారు. బావని ఏడిపించాలని! అసలే కోతి.

అన్నంత పనీ చేయగల సమర్థురాలని ఫీలై, వెంటనే నడుమ్మీద గిల్లాడు.

"ఎంత కమ్మగా వుంది బావా" అంది తాయారు. వెంటనే గోపాలం అరిచాడు.

ఉలిక్కిపడింది తాయారు.

"అదేంటి బావా.... అంత చేటున అరిచావు. కొంపదీసి ఏ తొండో నీ ప్యాంటులోకి దూరేసిందా?" చిలిపిగా నవ్వుతూ అడిగింది.

"కాదు..... అటు చూడు...."

రెండు మూడు ముసలి జంటలు యిటువైపే చూస్తున్నాయి.


వెంటనే తెగ సిగ్గుపడి, లోకేషన్‌ని టాంక్‌బండ్‌కు మార్చారు.


అక్కడ కూడా వాళ్ళ రొమాన్స్‌ని చూసేవాళ్ళే ఎక్కువయ్యారు.

జుట్టు పీక్కున్నాడు గోపాలం.

ఓ అరడజను వెంట్రుకలు చేతిలోకి వచ్చాయి.

వెంటనే భయపడిపోయి, తరుణోపాయం ఆలోచిస్తూ వుండగా 'బ్రహ్మం' మెదిలాడు.





బ్రహ్మం గోపాలానికి థిక్కెస్ట్ ఫ్రెండ్. సలహాలివ్వడంలో ఎక్స్‌పర్ట్.

వెంటనే టాంక్‌బండ్ దగ్గరున్న ఆ జంట మాయమై బ్రహ్మం యింటి ముందు ప్రత్యక్షమైంది.

★ ★ ★

"అదీ జరిగిన సంగతిరా బ్రహ్మం... ప్రేమికుల్ని సుఖంగా ఉండనివ్వడం లేదు. అందరూ మా వైపే చూస్తున్నారు" గోపాలం వాపోతూ బ్రహ్మంతో చెప్పాడు.

"అది చాలా కామన్ ఫ్రెండూ....... వయసులో వున్న ఓ అమ్మాయి, అబ్బాయి, అందులోనూ పెళ్ళికాని జంట.... కనిపిస్తే చూస్తారు"

"అంటే మాకు ప్రేమించుకునే అదృష్టం లేదా?"

"ఉంది.... ఏ అండమాన్‌కో, దక్షిణాఫ్రికా అడవుల్లోకో, ఎవరూ లేనని చోటకు వెళ్తే...."

"అది కాదు బ్రహ్మీ..... ఎలాగైనా నువ్వే ఓ ఐడియా చెప్పి పుణ్యం కట్టుకో.... నువ్వు చచ్చాక నీకు పాలరాతి సమాధి కట్టిస్తా...." అన్నాడు బ్రతిమిలాడుతున్న ధోరణిలో గోపాలం.

"ఒరే.... నీకు ఐడియా చెబుతాను కానీ..... నేనిప్పుడే చావాలని కోరుకోకురా...." అంటూ ఓ ఐడియా చెప్పాడు.

అదే ఆపరేషన్ అదుర్స్.

★ ★ ★

పార్క్‌లోకి ఆయాసపడుతూ ప్రవేశించింది ఆ జంట.

యాభై అయిదారేళ్ళుంటాయి స్త్రీకి, ఆ వృద్ధుడికి అరవై....

పార్క్‌లో వున్న అందర్నీ పరిశీలిస్తూ లోపలికి ప్రవేశించింది ఆ జంట.

వీళ్ళని ఎవరూ గమనించడం లేదు.

ఓ చెట్టు దగ్గరకి వెళ్ళి అక్కడ కూర్చున్నారు. బఠానీలమ్మే అతను వీళ్ళను చూడకుండానే వెళ్ళిపోయాడు.

"యిదిగో బఠానీలబ్బి....." పిలిచాడు వృద్ధుడు.

బఠానీలబ్బి నిర్లక్ష్యంగా వాళ్ళ దగ్గరకి వచ్చి "ఏం కావాలి?" అన్నాడు.

"బఠానీలు"

"ఈ వయసులో బఠానీలు కావాలా?" అంటూ విసుక్కొని బఠాణీలు యిచ్చి డబ్బులు తీసుకొని వెళ్ళిపోయాడు.

ఆ వృద్ధుడు, వృద్ధురాలి ఒడిలో తల పెట్టుకొని పడుకున్నాడు.

వీళ్ళని ఎవరూ గమనించడం లేదూ, పట్టించుకోవడం లేదు. దూరంగా ఓ పడుచుజంట ఒకరికొకరు వాటేసుకొని కూచుంటే వాళ్ళిద్దర్నీ చొంగకారుస్తూ చూస్తున్నారు చుట్టూవున్న జనం.

"ఏంటీ మనల్ని ఒక్కరూ చూడ్డం లేదు" ఆ ముసలతను అన్నాడు.

"అందరూ పడుచు అమ్మాయిలను, అబ్బాయిలనే చూస్తున్నారు" అంది ఆ ముసలి స్త్రీ.

"వాళ్ళందరికీ నేను పర్వపిండి ఒత్తిపెట్ట" అన్నాడు వృద్ధుడు.

అతని డిప్పకాయ మీద ఒక్కటిచ్చింది ముసలిస్త్రీ.

"పెళ్ళయ్యాక బెడ్రూంకి రండి.... మీ సంగతి చెబుతా...." అంది.

"హమ్మో..... ఈ దెబ్బకి నాలుగురోజులైనా తలనొప్పి పోదు. యింకా నయం.... బొచ్చుమీద విగ్గు వుంది కాబట్టి సరిపోయింది" అన్నాడు వృద్ధుడు.

ఆ తర్వాత ఓ అరగంట పార్కులో యిష్టమొచ్చినట్టు రొమాన్స్ చేసేస్కున్నారు.

అయినా వీళ్ళనెవరూ పట్టించుకోవడం లేదు.

లొకేషన్ టాంక్‌బండ్‌కు షిఫ్టయింది.

అక్కడ కూడా ఒకరి భుజం చుట్టూ మరొకరు చేయివేసుకుని కళ్ళలో కళ్ళు పెట్టుకొని రొమాన్స్ చేసేస్తున్నారు.

అయినా ఎవరూ వాళ్ళని గమనించలేదు. వీళ్ళని చూసినా చూడనట్టే వెళ్తున్నారు.

ఓ దశలో ఆ ముసలాయనకు వళ్ళు మండింది.

వృద్ధురాలైన ఆ స్త్రీ డిప్పకాయమీద ఒక్కటిచ్చేసరికి మిన్నకుండాపోయేడు.

అలా నెల్రోజులపాటు పార్కులు, టాంక్‌బండ్‌లు, లుంబినీ పార్క్, నెక్లెస్‌రోడ్స్ అన్నీ షికార్లు కొట్టారు. సినిమాలకు వెళ్ళారు.

వీళ్ళకు హాయిగా కమ్మగా అనిపించింది.

తెల్లారి పెళ్ళనగా.... ఆ రోజు పార్క్‌లోకి వెళ్ళి తనివితీరా ఒకరి కళ్ళలోకి మరొకరు చూసుకుని, ఆ తర్వాత టాంక్‌బండ్ దగ్గరకి వెళ్ళి ఒకరి భుజం మీద మరొకరు తల పెట్టుకొని...

చివరికి తలకున్న విగ్గు, మేకప్ గట్రా తీసేస్కున్నారు.

వాళ్ళే గోపాలం, తాయారూ..... బ్రహ్మం ఐడియా ప్రకారం ముసలి మేకప్‌లో నెల్రోజులు తమ యిష్టం వచ్చినట్టు ఎంజాయ్ చేశారు.

★ ★ ★

"చూశావా గోపూ..... ఇన్నిరోజులు మనల్నెవరూ పట్టించుకోలేదు" చెప్పింది తాయారు.

"అవును తారూ...." అన్నాడు తన్మయత్వంగా ఆమె కళ్ళలోకి చూస్తూ.

అప్పుడు అందరూ వాళ్ళని గమనించడం మొదలెట్టారు.

బ్రహ్మం వీళ్ళిద్దరి మధ్య పానకంలో పుడకలా ప్రత్యక్షమై అన్నాడు.

"అదే ఆపరేషన్ అదుర్స్ అంటే...."

వయసులో వున్న వాళ్ళు రొమాన్స్ చేసుకుంటే చూసే జనం, ముసలాళ్ళను పట్టించుకోరు. అదే మరి...... భూమ్యాకర్షణ శక్తంటే....." అన్నాడు.

అలా..... ఆ విధంగా ఆపరేషన్ అదుర్స్ ద్వారా వాళ్ళు ప్రయివసీగా రొమాన్స్ సరదాను తీర్చేసుకున్నారు. మీరు ట్రయ్ చేసి చూడండేం..! ❀